భూ అక్రమాలపై నివేదిక ఏదీ..?

కదిరిలో రూ. కోట్ల విలువ జేసే ప్రభుత్వ భూములు కబ్జా
విచారణకు ఆదేశించి నెలలు గడుస్తున్నా పట్టించుకోని వైనం

ప్రజాశక్తి - కదిరి టౌన్

పేదవాడు గూడు కోసం కార్యాలయాలు చుట్టు కాళ్లు అరిగేలా తిరిగినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు కబ్జాదారులకు మాత్రం కొమ్ముకాస్తూ వారి పంచన చేరుతూ అక్రమాలకు ఆజ్యం పోస్తున్నారు. కదిరి పట్టణం నాలుగు వైపులా పెద్ద ఎత్తున కోట్ల రూపాయల విలువచేసే ప్రభుత్వ భూములను కబ్జా చేసి నకిలీ పట్టాలు సృష్టించి లక్షల రూపాయలకు విక్రయించిన వారి పట్ల రెవెన్యూ అధికారులు కాస్తంత ఎక్కువ ప్రేమ చూపిస్తున్నారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఎవరూ ప్రశ్నిస్తారో చేసిన తప్పులకు సహకరిస్తారో అలాంటి వారిని రెవెన్యూ అధికారులు ముందే పసిగడతారు. గుట్టుచప్పుడు కాకుండా రెవిన్యూ సిబ్బంది వారు చేసిన తప్పులు బయటకు పడకుండా ముందస్తుగా సమాచారం ఇస్తూ మామ అనిపిస్తున్నారు. రాజకీయ పార్టీ నాయకులు తమను ఎవరు ఏమంటారు, ఏమి చేస్తారు అన్న ధీమాతో కోట్ల రూపాయల విలువచేసే ప్రభుత్వ భూములు దోచేస్తున్న వారికి కొందరు రెవెన్యూ అధికారులు సహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ స్థలాలు ఎక్కడున్నాయో గుర్తించి సర్వే నెంబర్లను వారే చెబుతూ కబ్జా దారులకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి . పేద ప్రజలకు సెంటు జాగా ఇవ్వాలంటే సవాలక్ష కారణాలు చెప్పే అధికారులు పలుకుబడి ఉన్న వారికి మాత్రం ఏ మాత్రం ఆలస్యం చేయకుండా వారే ప్రభుత్వ భూములను పరోక్షంగా చూపుతున్నారన్న విమర్శలున్నాయి. కదిరిలో అడిగేవారు ప్రశ్నించేవారు లేకపోవడంతో వైసిపి హయాంలో కబ్జాదారులు రెచ్చిపోయారు. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములతో పాటు ఇందిరమ్మ కాలనీ, జగనన్న కాలనీలలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలకు నకిలీ పట్టాలు సృష్టించి విక్రయించారు. కబ్జా చేసిన భూములలో పెద్ద పెద్ద భవనాలు కూడా నిర్మించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌కి పలు సందర్భాల్లో ఈ కబ్జాలపై పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో గతంలో ఎమ్మెల్యే కందికుంట ఆ కాలనీలలో పర్యటించి అక్రమాల పై విచారణకు ఆదేశించి నకిలీ ఇంటి నివేశ పట్టాలు బాగోతం తేల్చాలని అధికారులను ఆదేశించారు. విచారణలో కబ్జాదారుల ఆగడాలు పెద్ద ఎత్తున బయటపడ్డాయి. కదిరిలోని జగనన్న కాలనీలు, పార్థసారథి ,దేవానంద్, బండారు లక్ష్మణ్ కాలనీలలో పాటు సర్వేనెంబర్ 1713, 1769, 1770, 83, 96 లలో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములు పేదలు, కార్మికులు పేరుతో కబ్జా చేసి ఇతరులకు విక్రయించినట్లు ఆరోపణలు వచ్చాయి. కబ్జాలు, నకిలీ పట్టాలు, భూ అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆర్డీవోను ఆదేశించారు. దీంతో ఆర్డీవో స్పందించి అక్రమాలప విచారణకు నాలుగు టీములను ఏర్పాటు చేశారు. విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇది జరిగి దాదాపు రెండు నెలలు అవుతున్న నేటికీ నివేదిక ఉన్నత స్థాయి అధికారులకు రెవెన్యూ అధికారులు ఇవ్వకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నాలుగు టీములు విచారణ కమిటీ సభ్యులుగా అధికారులను నియమించినప్పటికీ అక్రమాలు గుర్తించడంలో విఫలమయ్యారన్న విమర్శలు వినపడుతున్నాయి. జూన్ 9నే నివేదిక ఇస్తామని తెలిపిన రెవెన్యూ అధికారులు ఆ దిశగా అడుగులు వేయకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయంలో ముఖ్యంగా ఎర్రగుంటపల్లి జగనన్న కాలనీలో వందలాది నకిలీ పట్టాలను సృష్టించి లక్షలాది రూపాయలకు విక్రయించారు. భవన నిర్మాణ కార్మికులకు కేటాయించిన స్థలాన్ని ఆ సంఘానికి సంబంధం లేని వారు కబ్జా చేసి ఇతరులకు విక్రయించారని పలువురు కార్మికులు కలెక్టర్, ఆర్డీవో, తహశీల్దార్‌కు పలుమార్లు వినతిపత్రం అందజేశారు. కోట్లాది రూపాయల ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నప్పటికీ ఈ విషయంలో జాప్యం కొనసాగుతోంది, వైసిపి పాలనలో పనిచేసిన రెవిన్యూ కిందిస్థాయి సిబ్బంది వైసిపి నేతల అక్రమాలు బయటపడకుండా చూస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి, రెవెన్యూ సిబ్బందిపై కొంతమంది కబ్జాదారులు ఒత్తిడి చేసి నివేదికలో తమ పేర్లు లేకుండా జాగ్రత్త పడుతున్నట్లు సమాచారం.

పట్టణంలో అక్రమాలపై విచారణకు ఆదేశించి నెలలు గడుస్తున్న మాటల్లో తప్ప... చేతుల్లో అధికారులు పురోగతి చూపడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత నెల జూన్ 9వ తేదీనే నివేదికల అందజేస్తామని చెప్పిన అధికారులు ఆ దిశగా అడుగులు లేకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మరోవైపు సాక్షాత్తు ఆర్డీవో కార్యాలయం ముందు భవన నిర్మాణ కార్మికుల స్థలాలను సైతం కబ్జా చేసేశారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో నివేదికలను సిద్ధం చేసి ఉన్నత అధికారులకు అందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఎర్రగుంటపల్లిలో నిర్మించిన పెద్ద భవనం

కాలయాపనతో సరి

పట్టణంలోని సర్వే నెంబర్ 1713, 1769, 70 లో భవన నిర్మాణ కార్మికులు కోసం గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన పట్టాల మంజూరులో అవకతవకలు జరిగాయి. ఇతరులకు విక్రయించి కోట్ల రూపాయలు గడించారు. విచారణ జరపాలని కలెక్టర్, ఆర్డీవో, తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు. విచారణ పేరుతో అధికారులు కాలయాపన చేస్తున్నారు.

టోపీవలి,
భవన నిర్మాణ కార్మికుడు కదిరి.

నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తాం

కదిరి చుట్టుపక్కల భూ అక్రమాలపై పలుమార్లు ఫిర్యాదులు అందాయి. ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు విచారణ కోసం నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం, విచారణ చేపడుతున్నాం. కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు తదితర పనుల వల్ల విచారణ జాప్యం అవుతోంది. త్వరలోనే నివేదికలు తెప్పించుకొని ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

మురళీకృష్ణ,
తహశీల్దార్ కదిరి

చినుకు రాలదు.. సాగు సాగదు...

కలవరపెడుతున్న తొలకరి
వాన కోసం అన్నదాతల ఎదురుచూపు
ఖరీఫ్ సాగుపై రైతుల్లో దిగులు



ఆదిలోనే హంసపాదు అన్నట్టుగా ఉంది ఈ ఏడాది తొలకరి పరిస్థితి. మృగశిర కార్తెలో భారీ వర్షాలు పడతాయని ఆశించిన రైతుకు నిరాశే మిగిలింది. ఎండలు రోహిణి కార్తెను తలపిస్తున్నాయి. చినుకు జాడ లేదు. వరుణుడు కరుణించటం లేదు. తీవ్రమైన ఎండ, వేడి గాలుల వల్ల పొలాల్లో పైపదును పూర్తిగా ఆరిపోయింది. సకాలంలో వానలు కురుస్తాయని ముంగారుకు సిద్ధమైన రైతులకు నిరాశే ఎదురైంది. వర్షం కోసం రైతులు ఆకాశం వైపు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు.

ప్రజాశక్తి-పెనుకొండ

మురిపించిన ముందస్తు వర్షాలు

గతేడాది కంటే ఉమ్మడి అనంత జిల్లాలో ఈ ఏడాది రోహిణి కార్తెలో భారీ వర్షాలు పడటం.. పంట పొలాలు పదును కావటం, వాతావరణం చల్ల బడటం. ముందుగానే తొలకరి రావటంతో జిల్లాలో రైతులు ఎంతో సంబరపడ్డారు. అయితే ఇప్పుడు జులై వచ్చినా వరుణుడు కరు ణించడం లేదు. కారుమబ్బులు కమ్ముకుంటున్నా బలమైన గాలులతో మేఘాలను తరిమేస్తున్నాయి. దుక్కులు చేసుకుని సిద్ధంగా ఉన్న అన్నదాతలు నిత్యం ఆకాశం వైపు చూస్తున్నారు. మే చివరి వారంలో కొద్దిమంది వేరుశనగ విత్తారు. జూన్‌లో చినుకు జాడలేదు. కంది, మొక్కజొన్న, పత్తి, ఆముదం, సజ్జ తదితర చిరుధాన్యాలను తొలకరిలో విత్తనం వేశారు. విత్తనాలు సజావుగానే మొలకెత్తాయి. చినుకు పడలేదు. ఎండలు వేసవిని తల పిస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెంటీగ్రేడుకు తగ్గటం లేదు. దీనికితోడు బలమైన గాలులు వీస్తు న్నాయి. ఎండ గాలుల వల్ల పొలాల్లో పైపదును పూర్తిగా ఆరిపోయింది. మొలిచిన మొక్కలు వడలిపోతున్నాయి. వేరుశనగ, సజ్జ, కంది పైర్లు ఎదుగుదల లోపించి నేలను అంటిపెట్టుకున్నాయి. వర్షం కోసం రైతులు ఆకాశంవైపు చూస్తున్నారు. పొడి వాతావరణంలో భూమిలో ఉన్న విత్తనాలను పురుగులు తినే స్తాయని రైతులు చెబుతున్నారు. నెలన్నర రోజులుగా వరుణుడు ముఖం చాటేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

వేసవిలో అత్యధిక వర్షపాతం

ఉమ్మడి జిల్లాలో సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో భారీగా ఉష్ణోగ్రతలు పెరిగాయి. అయితే ఆయా నెలల్లోనే సాధారణం కంటే అత్యధిక వర్షపాతం నమోదు కావడం గమనార్హం. మే చివరి వారంలో నైరుతి రుతుపవనాలు రావడంతో భారీ వర్షాలు కురిసి పంటలకు నష్టం వాటిల్లింది. శ్రీసత్యసాయి జిల్లాలో గతేడాది జూన్‌లో సాధారణంగా 66.6 మిల్లీమీటర్ల వర్షపాతానికి గాను 148.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అనంత జిల్లాలో గతేడాది జూన్‌లో 61.0 మిల్లీమీటర్లు సాధారణ వర్షపాతం కాగా 142 మిల్లీమీటరుల నమోదైంది.

అత్యల్పంగా సాగు

జూన్ ఒకటి నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. అన్ని రకాల పంటల సాధారణ సాగు లక్ష్యం 16,12,991 ఎకరాలు. ఇప్పటి వరకు 47,487 ఎకరాలు సాగయ్యాయి. శ్రీసత్యసాయి జిల్లాలో సాధారణ సాగు లక్ష్యం 6,64,842 ఎకరాలకు గాను 23,449 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అనంత జిల్లాలో సాధారణ సాగు లక్ష్యం 8,48,149 ఎకరాలు కాగా అందులో 24,044 ఎకరాలు మాత్రమే సాగైనట్లు వ్యవసాయ శాఖ గణంకాలు చెబుతున్నాయి.

18,700 వేల ఎకరాల్లోనే వేరుశనగ

ఉమ్మడి జిల్లాలో ప్రధాన పంట వేరుశనగ ఇప్పటి వరకు కేవలం 18,786 ఎకరాల్లోనే సాగైంది. ఈనేపథ్యంలో వేరుశనగ రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వర్షాధారంపై ఆధారపడే రైతులు ఈ ఏడాది వేరుశనగ సాగు చేసేందుకు వెనకడుగు వేస్తున్నారు. కంది 8,653 ఎకరాలు, మొక్కజొన్న 6,714, పత్తి 6,675, ఆముదం 2,595, సజ్జ 1000 ఎకరాలు సాగైనట్లు వ్యవసాయశాఖ గణాంకాలు చెబుతున్నాయి.

రొద్దం మండలంలో దుక్కి దున్ని సాగు కు సిద్ధం చేసిన పొలం

వర్షం కోసం ఎదురు చూస్తున్నాం

ఈఏడు ముందుగా వర్షాలు కురిశాయి. రైతులు సాగుకు సిద్ధమైయ్యారు. చివరకు చినుకు పడక రైతులు నిరాశతో ఆకాశం వైపు చూస్తున్నారు. ఇలాగే కొనసాగితే ఈఏడాది వేరుశనగ సాగు విస్తీర్ణం తగ్గి పోతుంది. పొలాలను దుక్కిచేసి వర్షం కోసం ఎదురు చూస్తున్నాం.

శివయ్య,
రైతు, మావటూరు,
పెనుకొండ మండలం

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు : వైసిపి

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని, రెడ్ బుక్ రాజ్యాంగంలో మహిళలకు రక్షణ లేదని వైసిపి నియోజకవర్గ సమన్వయ కర్త దీపిక వేణురెడ్డి ఆరోపించారు. బీసీ మహిళ, కృష్ణా జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక మీద జరిగిన దాడిని ఆమె ఖండించారు. ఈ విషయంపై ఆదివారం పార్టీ కార్యాలయంలో దీపిక విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ప్రభుత్వ సెక్యూరిటీ ఉన్నా హారిక మీద ఎలా దాడి జరిగిందో పోలీసులు, హోంమంత్రి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన గూండాలు పార్టీ జెండాలు చేత్తో పట్టుకొచ్చి రాళ్లు, కర్రలు, ఇనుప రాడ్లతో దాడులు చేస్తుంటే పోలీసులు చోద్యం చూస్తూ కూర్చున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి ఇలాంటి సంస్కృతి మంచిది కాదన్నారు. వీటన్నింటికీ భవిష్యత్తులో ఖచ్చితంగా మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. హారిక మీద దాడులు చేసిన వారిని వెనకేసుకొస్తూ జిల్లా మంత్రి ఆమెది నటన అని చులకన చేసి మాట్లాడటం సిగ్గు చేటన్నారు. జిల్లా ప్రథమ పౌరురాలిగా ఉన్న మహిళకు రక్షణ కల్పించడంలో విఫలమైనందుకు సిగ్గుపడకుండా గౌరవప్రదమైన మంత్రి స్థానంలో ఉండి ఇలా మాట్లాడటం ఆయనకే సిగ్గుచేటు అన్నారు. బీసీ వర్గానికి చెందిన మహిళ ప్రజాప్రతినిధి మీద దాడి జరిగితే సీఎం, డిప్యూటీ సీఎం, హోంమంత్రి, డిజీపీ, మహిళా కమిషన్ ఇంతవరకు స్పందించకపోవడం దారుణమన్నారు. ఇలాంటి దాడులు ఇంకెప్పుడు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత సీఎం, డీజీపీ, హోంమంత్రి మీద ఉందన్నారు. హారిక కుటుంబానికి వైఎస్సార్సీపీ అండగా ఉంటుంది అన్నారు. పెనుగొండ నియోజకవర్గంలో ఒక బీసీ హాస్టల్లో ఫుడ్ పాయిజనై ఆడపిల్లలు అస్వస్థతకు గురైతే.. విషయం తెలుసుకున్న జిల్లా అధ్యక్షురాలు ఉష అక్కడికి వెళ్లి బాలికలను ఆసుపత్రికి తరలించే క్రమంలో, టిడిపికి చెందిన వారు అంబులెన్స్ ను కూడా ముందుకు కదలనివ్వకుండా అడ్డు వచ్చారని అక్రమ కేసులు కూడా బనాయించారని అన్నారు. ఇది ఎంతవరకు సమంజసం అన్నారు. అదే విధంగా తాడిపత్రికి చెందిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆయన నివాసానికి కూడా వెళ్ళనివ్వకుండా, ప్రభుత్వ పెద్దల ప్రోత్బలంతో పోలీసులు ఆయనను కూడా అడ్డుకోవడం చాలా దారుణమన్నారు. అధికారం శాశ్వతం కాదన్న విషయాన్ని కూటమి నాయకులు గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

దేవాలయాల భూముల పరిరక్షణకు చర్యలు

జిల్లా దేవాదాయ శాఖ అధికారి బి. నరసింహరాజు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

దేవాలయాల క్రింద ఉన్న భూముల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆ భూములను ఆక్రమించుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా దేవాదాయ శాఖ అధికారి బి. నరసింహారాజు తెలిపారు.. ఏ చిన్న దేవాలయం అయినా సరే కొంత భూమి ఉంటుంది. గతంలో రాజుల కాలం నుంచి ఆ దేవాలయాలకు ధూప దీప నైవేద్యం పెట్టడానికి తగిన భూములు కేటాయించారు. ఆ సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది. పలు ఆలయాలు ఆలనా పాలనా సరిగా లేక శిథిలావస్థకు చేరుకున్నాయి. దేవాలయాల పరిధిలో ఉన్న కొన్ని భూములను ఎలాంటి భయం లేకుండా అక్రమార్కులు ఆక్రమించుకున్న సంఘటనలు ఉన్నాయి. సామాన్యులకు మాత్రమే దేవుడంటే భక్తి భయం ఉంటున్నాయి. అక్రమార్కులకు ఎలాంటి భయం లేకుండా అప్పనంగా ఆక్రమించుకుని భూములను తమ ఆధీనంలో ఉంచుకుంటున్నారు. అలాంటి వారిపై ప్రభుత్వ పరంగా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కొన్ని ప్రాంతాల్లో కొన్ని దేవాలయాలకు ఆదాయం ఎక్కువగా ఉన్నచోట ప్రత్యేకంగా అర్చకులు, కార్యనిర్వహణ అధికారి ఉంటున్నారు. ఆదాయాన్ని బట్టి అర్చకులకు వేతనాలు కూడా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని దేవాలయాల నిర్వహణ, ఆదాయం, భూముల నిర్వహణ తదితర అంశాలపై జిల్లా దేవాదాయ శాఖ అధికారి బి. నరసింహరాజు ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.

ప్రశ్న:- జిల్లాలో ఎన్ని దేవాలయాలు ఉన్నాయి? అధిక ఆదాయం ఉన్న దేవాలయాలు ఎన్ని ఉన్నాయి? ఎక్కడెక్కడ ఉన్నాయి?

జవాబు: జిల్లాలో మొత్తం 1139 దేవాలయాలు రిజిస్టర్ అయినవి ఉన్నాయి. వీటిలో ఎక్కువ ఆదాయ కలిగినవి 8 మాత్రమే ఉన్నాయి. అవి కదిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, ధర్మవరంలో లక్ష్మీ చెన్నకేశవ స్వామి, పాండురంగ దేవాలయం, దుర్గదేవి దేవాలయం, రామగిరి మండలంలో నసనకోట ముత్యాలమ్మ, హిందూపురంలో వేణుగోపాలస్వామి ఆలయం, పేట వెంకట రమణ స్వామి, బుడ్డం రంగనాథ స్వామి, అనంత పద్మనాభ స్వామి ఆలయాలు, లేపాక్షిలో వీరభద్ర ఆలయం, లేపాక్షి బసవన్న, మడకశిర మండలం బత్తలపల్లి నరసింహస్వామి ఆలయం, హేమావతిలో సిద్దేశ్వర స్వామి ఆలయం, ప్రసిద్ధి చెంది ఉన్నాయి. ఆయా ఆలయాల బట్టి రూ. 5 లక్షల నుంచి రూ. 15 లక్షల పైనే ఆదాయం కలిగి ఉన్నాయి.

ప్ర: అర్చకులకు వేతనాలు ఉంటాయా? ఆదాయం లేని చోట అర్చకుల పరిస్థితి ఏమిటి?

జ: ఆదాయం ఎక్కువగా ఉన్న దేవాలయాలకు కార్య నిర్వహణ అధికారి (ఈవో) ఉంటాడు. దేవాలయాల్లో వచ్చిన ఆదాయం బట్టి అక్కడ అర్చకులకు వేతనాలు ఉంటాయి. అలాగే తక్కువ ఆదాయం ఉన్న దేవాలయాలలో అసలు వేతనాలు ఉండవు. అయితే ఆ దేవాలయాలలో ధూప దీప నైవేద్యం పెట్టడానికి ఆయా దేవాలయాలకు ఉన్న భూములను అర్చకులు అనుభవిస్తూ ఉంటారు. మరికొన్ని చోట్ల అవసరం బట్టి ఆయా దేవాలయాలకు ఉన్న భూములను మూడేళ్లకు ఒకసారి వేలం వేసి వచ్చిన ఆదాయంతోనే ఆ దేవాలయాల ఆలనా పాలనకు వినియోగిస్తుంటారు. ఇవన్నీ కూడా ఆయా గ్రామాల ప్రజల సమిష్టి నిర్ణయం వరకు జరుగుతుంటాయి.

ప్ర: దేవాలయాల క్రింద మొత్తం జిల్లాలో ఎన్ని భూములు ఉన్నాయి? ఆక్రమణదారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ : జిల్లాలో దేవాలయాల ఆధర్వంలో మొత్తం 10,786 ఎకరాల భూములు ఉన్నాయి. వీటిలో సుమారు 500 ఎకరాలు వరకు అన్యాక్రాంతమైన భూములు ఉన్నాయి. ఆక్రమణదారులకు ఇప్పటికే నోటీసులు ఇచ్చాము. వారు స్పందించకుంటే చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకుంటాం.

ప్ర: దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు వస్తాయా?

జ: దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నిధులు మంజూరు కావు. ఎందుకంటే ఆ దేవాలయాలకు భూములు ఉన్నాయి. మరికొన్ని దేవాలయాలలో వార్షిక ఆదాయం రూ. 5 లక్షల నుంచి పది లక్షల రూపాయలకు పైబడి ఆదాయం వస్తుంటాయి. ఆ నిధులతోనే అర్చకుల వేతనాలు చెల్లించబడతాయి. ఆలయాలను నమ్ముకున్న అర్చకులకు ఏదేని ప్రమాదం సంభవిస్తే వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించబడుతుంది. తక్కువ ఆదాయం, లేదా ఆదాయమే లేని దేవాలయాలు ఆ దేవాలయాలకు ఉన్న భూములే ఆధారంగా ఉంటాయి. కొన్ని గ్రామాల్లో అర్చకులే ఆ భూములను అనుభవిస్తూ ఆ గుడి దీప ధూప నైవేద్యం అందిస్తుంటారు. మరికొన్ని గ్రామాల్లో ఆయా గ్రామస్తుల సమక్షంలో భూములు వేలం ద్వారా ఆదాయం సమకూర్చుకోవడం జరుగుతుంది.

ప్ర : మీ శాఖలో సిబ్బంది కొరత ఉందా? సొంత భవనం ఉందా?

జ : సిబ్బంది కొరత అయితే ఉంది. తమ కార్యాలయంలో 12 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా ముగ్గురమే ఉన్నాము. అలాగే కార్యనిర్వాహణ అధికారులు (ఈవోలు) 9 మంది ఉండాల్సి ఉండగా అందులో ముగ్గురు మాత్రమే ఉన్నారు. 9 మంది ఈవోల పని ముగ్గురే చేయాల్సి వస్తోంది. ప్రభుత్వానికి నివేదించాము. అలాగే శ్రీ సత్యసాయి జిల్లా నూతనంగా ఏర్పడినందున ఇంకా మా శాఖకు సొంతభవనం అంటూ లేదు. పుట్టపర్తి మండల పరిధిలోని మామిళ్ళకుంట క్రాస్ లో అద్దె భవనంలో కార్యాలయం కొనసాగుతోంది.

జిల్లా దేవాదాయ శాఖ అధికారి నరసింహరాజు

ఏపీకి 'ఓడీ-ఓపీ' అవార్డుల పంట

రాష్ట్రానికి 10 ఓడీ-ఓపీ అవార్డులు
నేడు న్యూఢిల్లీలో అవార్డుల ప్రదానం
మంత్రి సవిత

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

వన్ డిస్ట్రిక్ట్,వన్ ప్రొడక్ట్(ఓడీ, ఓపీ)కింద ఆంధ్రప్రదేశ్ నుంచి తొమ్మిది ఉత్పత్తులకు అవార్డులు వచ్చినట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. తొమ్మిది ప్రొడక్టుల్లో ఏడు ఉత్పత్తులు చేనేత, హస్త కళలకు చెందినవి కాగా, రెండు వ్యవసాయ రంగానికి సంబంధించినవని వెల్లడించారు. వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ విభాగంలో జాతీయ స్థాయిలో మూడు రాష్ట్రాలు ఎంపిక కాగా అందులో ఏపీకి మరో అవార్డు వచ్చిందని ఆమె ఆనందం వ్యక్తంచేశారు. ఆదివారం పెనుకొండలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రోత్సాహంతో రాష్ట్రంలో చేనేత పరిశ్రమ, హస్త కళలు అభివృద్ధి దిశగా పరుగులు తీస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడెక్ట్ కింద రాష్ట్రం నుంచి తొమ్మిది ఉత్పత్తులకు కేంద్ర ప్రభుత్వం అవార్డులు ప్రకటించిందన్నారు. వాటిలో ఏడు ఉత్పత్తులు చేనేత, హస్త కళలకు చెందినవన్నారు. వాటిలో విజయనగరం జిల్లా నుంచి బొబ్బిలి వీణ, అనకాపల్లి జిల్లా నుంచి ఏటికొప్పాక బొమ్మలు, కాకినాడ నుంచి పెద్దాపురం సిల్క్ శారీ, బాపట్ల నుంచి చీరాల సిల్క్ శారీ, తిరుపతి నుంచి వెంకటగిరి శారీ, నర్సాపూర్ అల్లికల కుట్టు, సత్యసాయి జిల్లా నుంచి ధర్మవరం పట్టు చీరలు ఉన్నాయన్నారు. వ్యవసాయ రంగం నుంచి గుంటూరు మిర్చి, శ్రీకాకుళం నుంచి జీడిపప్పు ఎంపికయ్యాయన్నారు. ఓడీ ఓపీ విభాగంలో జాతీయ స్థాయిలో ఏపీకి మరో అవార్డు వచ్చినట్లు తెలిపారు. ఏ విభాగంలో అవార్డు వచ్చిందో సోమవారం అవార్డుల ప్రదానోత్సవంలో ప్రకటిస్తారని మంత్రి వెల్లడించారు. న్యూఢిల్లీలోని భారత మండపంలో నిర్వహించే కార్యక్రమంలో ఓడీ–ఓపీ అవార్డులను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చేతుల మీదుగా సోమవారం అందజేయనున్నారన్నారు. ఈ అవార్డుల స్వీకరణకు తనతో పాటు ఆయా జిల్లాల కలెక్టర్లు, కళాకారులు ఆదివారం బయలుదేరి వెళుతున్నట్లు మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే రాష్ట్రానికి పది అవార్డు రావడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తం చేశారు.

మరిన్ని ఉత్పత్తులకు ఓడీ, ఓపీ

రాష్ట్రంలో మరిన్ని ఉత్పత్తులకు వన్ డిస్ట్రిక్ట్, వన్ ప్రొడక్ట్ గుర్తింపు తీసుకురాడానికి తీవ్రంగా కృషి చేస్తున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. ఇదే విషయమై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం దృష్టికి సీఎం చంద్రబాబునాయుడు తీసుకెళ్లారన్నారు. కడపలో అరటి, చిత్తూరు టమోటా, అనంతపురం వేరు శనగ ఉత్పత్తులను వన్ డిస్ట్రిక్, వన్ ప్రొడెక్టు కింద ఎంపిక చేసేలా కృషి చేస్తున్నామన్నారు.

అవార్డులతో అమ్మకాలకు ఊతం

రాష్ట్రంలో ప్రతి జిల్లా నుంచి ఓడీ ఓపీ ఉత్పత్తుల ఉండేలా ప్రణాళికలు రచించినట్లు మంత్రి సవిత తెలిపారు. ఇందుకోసం చేనేత, హస్త కళాకారులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఓడీఓపీ అవార్డులతో రాష్ట్రంలో చేనేత, హస్త కళలకు మరింత ప్రోత్సాహం లభించనుందన్నారు. ఈ అవార్డులు కళాకారుల్లో నూతన ఉత్సాహం తీసుకురావడంతో పాటు ఉత్పత్తుల అమ్మకాలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఓడీఓపీ అవార్డుల సాధన వెనుక సీఎం చంద్రబాబుతో పాటు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు.

వచ్చే నెల 7 నుంచి చేనేతలకు ఉచిత విద్యుత్

ఆగస్టు ఏడో తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మగ్గాలున్న చేనేతలకు 200 యూనిట్లు, మరమగ్గాలున్న వారికి 500 యూనిట్లు ఉచిత విద్యుత్ పథకం ప్రారంభించనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. అదే రోజు త్రిఫ్ట్ ఫండ్ నిధులు విడుదల చేయనున్నామన్నారు. ఎన్నికల ముందు చేనేతలకు ఉచిత విద్యుత్ అందిస్తామని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ మాటిచ్చిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ చేనేతలకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేయబోతున్నామన్నారు.

మరిన్ని ఆప్కో షోరూమ్ ల ఏర్పాటు

చేనేత ఉత్పత్తుల అమ్మకాలు పెంచేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి సవిత తెలిపారు. ఇప్పటికే ఈ కామర్స్ ద్వారా చేనేత వస్త్రాల అమ్మకాలు ప్రారంభించామన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 97 ఆప్కో షో రూమ్ లున్నాయని, మరిన్ని షో రూమ్ ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఆప్కో షోరూమ్‌ల ఏర్పాటుతో చేనేత ఉత్పత్తులు మరింత పెరిగే అవకాశముందని, దీనివల్ల నేతన్నలకు ఆర్థిక భరోసా లభిస్తుందని మంత్రి సవిత తెలిపారు.

యూరియా కావాలంటే డిఎపి కొనాల్సిందే..!

ప్రజాశక్తి-కదిరి టౌన్

రైతులు సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు యూరియా కోసం ఫర్టిలైజర్ షాపులకు వెళ్తే వారు తప్పనిసరిగా డిఎపి, సల్ఫేట్, తదితర రసాయన ఎరువులు, మందులు కొనాలని షరతు పెడుతున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే రైతులు ప్రయివేటు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి అప్పులు చేసి పంటలు చేశారు. ఇప్పుడు పంటలను కాపాడుకునేందుకు

యూరియాతో పాటు డిఎపి కొనాలంట..

తాను కష్టపడి మొక్కజొన్న పంట సాగు చేశా.. ప్రస్తుతం కంకి దశలో ఉంది. పంట దృఢత్వం కోసం పట్టణంలోని శ్రీనివాస ఫర్టిలైజర్ షాపులో యూరియా కోసం వెళ్తే డిఎపి కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తామని షరతు పెట్టారు. దీనికి తోడు ఒకటి రెండు బస్తాలు తప్ప నాలుగైదు బస్తాలు ఇవ్వడం సాధ్యం కాదని షాపు యజమానులు ఖరాఖండిగా చెప్పారు.

డి.తిరుమలేశ్వర్‌రెడ్డి, రైతు చిప్పలమడుగు

రైతులను దోచుకుంటున్న వ్యాపారులు.. పట్టించుకోని అధికారులు..

యూరియా కోసం వెళ్తే ఫర్టిలైజర్స్ షాపుల యాజమాన్యాలు ఇలా నిబంధనలు పెట్టడం ఏంటని రైతులు మండిపడుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం పట్టణంలోని పలు ఫర్టిలైజర్స్ షాపుల వద్ద రైతుల పరిస్థితులపై ప్రజాశక్తి ఆరా తీసింది. యూరియా కోసం షాపునకు వెళ్తే ఇతర రసాయన ఎరువులు, మందులు కొనుగోలు చేయాల్సిందేనని యాజమానులు చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని మండల వ్యవసాయ అధికారి దృష్టికి తీసుకెళ్లగా రైతులు, ఫర్టిలైజర్స్ షాపుల యాజమానులకు సత్సంబంధాలు సరిగా లేవేమోనని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం గమనార్హం.

అధిక ధర వసూలు

పట్టణంలోని హిందూపురం రోడ్డులో ఉన్న శ్రీనివాస ఫర్టిలైజర్ షాపు యాజమానులు అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. వారు ప్రభుత్వం నిర్దేశించిన ధర కాకుండా పెద్ద మొత్తంలో విక్రయిస్తూ రైతుల నడ్డి విరుస్తున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి యూరియా బస్తా ధర రూ. 268 ఉండగా రూ. 350 వరకూ విక్రయిస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. ఇలా అధిక ధరకు విక్రయించడమే కాకుండా ప్రస్తుతం రైతులకు అవసరం లేని ఎరువులు కూడా కొనుగోలు చేయాల్సిందేనని షరతు విధిస్తున్నట్లు సమాచారం. విధి లేని పరిస్థితుల్లో రైతులు అప్పులు చేసి యూరియాతో పాటు ఇతర ఎరువులు కొనుగోలు చేస్తున్నారు.

అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటల కోసం ఎరువులు, ఇతర రసాయనిక మందులు కొనుగోలుకు వెళ్తే అధిక ధరలకు విక్రయించినా, యూరియా ఎరువుల కొరత సృష్టించినా చర్యలు తప్పవు.

సనావుల్లా, ఎడిఎ కదిరి

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు విధుల బహిష్కరణ

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

తమ సమస్యలు పరిష్కారంలో భాగంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు విధులను బహిష్కరించి సమ్మె బాట పట్టారు. ఇందులో భాగంగా ఆదివారం హనుమాన్ సర్కిల్‌లో నిరసన చేపట్టి నినాదాలు ఇచ్చారు. సిఐటియు పట్టణ కార్యదర్శి పైపల్లి గంగాధర్ మాట్లాడుతూ 20 రోజులుగా వివిధ రూపాల్లో కార్మికులు నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం స్పందించలేదన్నారు. దీంతో సిఐటియు మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సమ్మెలోకి వెళ్తూ విధులను బహిష్కరించామన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి జీవో-36 మేరకు వేతనాలు పెంచాలని, షరతులు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, గత సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని, గ్రాట్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. సమ్మెకు ప్రజలు కూడా మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ నాయకులు రమణ, రమేష్, గణేష్, రామదాసు, సాయినాథ్, సద్దాం, సాయి, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తిలో నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

ధర్మవరం రూరల్ : 17 రోజులుగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు రిలే దీక్షలు చేస్తున్నా ప్రభుత్వానికి పట్టదా అని ఆ విభాగం అధ్యక్షులు బొగ్గు నాగరాజు, కార్యదర్శి బాబు మండిపడ్డారు. పట్టణంలో చేపట్టిన దీక్షా శిబిరంలో వారు మాట్లాడుతూ ఉద్యోగాలను శాశ్వతం చేయాలని, ఈఎస్ఐ, హెల్త్ అలవెన్స్, ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మికులు మరణించిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతిసారి ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేయడం తగదన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకూ సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. శిబిరంలో అనిల్, జయకృష్ణ, చెన్నకేశవులు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని 22వ వార్డు సాయి నగర్‌లో ఆదివారం చేపట్టిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యమ్రకంలో నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఇటీవల అనారోగ్యంతో ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన రూరల్ మండలంలోని కత్తెకొట్టాల గ్రామానికి చెందిన బన్నెల కళ్యాణ్‌కు ముఖ్య మంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ. 7 లక్షల చెక్కును కళ్యాణ్‌కు అందజేశారు. శ్రీరామ్ మాట్లాడుతూ ఏడాది పాలనపై ప్రజల్లో సంతోషం కనిపిస్తోందన్నారు. అయితే ఇంకా కొన్ని సమస్యలు మా దృష్టికి వచ్చాయని, వాటిని తప్పకుండా అతిత్వరలో పరిష్కరిస్తామన్నారు. వైసిపి నాయకులు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను ఎలా భయభ్రాంతులకు గురి చేశారో, ప్రతిపక్షాలపై అక్రమ కేసులు పెట్టించి, ఇబ్బంది పెట్టేలా వ్యవహరించారో ఇప్పుడు కూడా అదే ధోరణితో వ్యవహరిస్తున్నారన్నారు. వారి మాటలు, బెదిరింపులకు బెదిరే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. టిడిపి శ్రేణులు కూడా అవేవీ పట్టించుకోకుండా ఈ నాలుగేళ్లు ప్రజలకు మంచి చేయడంలోనే ఉండాలని శ్రీరామ్ సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న పరిటాల శ్రీరామ్

టిడిపి నాయకులతో ఎంపి సమీక్ష

ప్రజాశక్తి-రొద్దం

హిందూపురం పార్లమెంట్ పరిధిలోని టిడిపి నాయకులతో ఆదివారం ఎంపి బికె.పార్థసారథి మండలంలోని మరువపల్లి గ్రామంలోని ఆయన నివాసంలో సమీక్ష నిర్వహించారు. హిందూపురం పార్లమెంట్ పరిధిలోని వివిధ నియోజకవర్గాల నుంచి హాజరైన నాయకులు, కార్యకర్తలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష, సమావేశం నిర్వహించారు. అంతకుముందు టిడిపి శ్రేణులు ఎంపికి పూలమాల వేసి సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు, పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపి బికె.పార్థసారథిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

అనుమతి లేని బోరుబావి పనుల నిలిపివేత

ప్రజాశక్తి-పరిగి

మండలంలోని కొడిగెనహళ్లి పంచాయతీ పరిధిలోని కాలువపల్లి గార్మెంట్ సమీపంలోని ఓ లేఅవుట్‌లో ఆదివారం అధికారుల అనుమతి లేకుండా లేఅవుట్ యజమాన్యం బోరుబావి తవ్వకం చేపట్టగా రెవెన్యూ అధికారులు అడ్డుకుని నిలిపేశారు. వివరాలు.. మండలంలోని ఓ బోరుబావి యంత్రం ఏజెంట్ శంకర్ లేఅవుట్‌లో బోరు వేసేందుకు సిద్ధమయ్యాడు. గ్రామస్తుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న సంబంధిత అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని అనుమతులు లేకుండా బోరు వేయకూడదని నిలిపివేశారు. గత మూడు రోజుల్లో ఈ లేఅవుట్‌లో రెండో సారి బోరు వేస్తున్నట్లు వీఆర్వోల ద్వారా సమాచారం తెలుసుకున్న తహశీల్దార్ సుల్తానా సైతం లేఅవుట్ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా సంబంధిత ఏజెంట్ తాను ఎంపి మనిషిని, బోర్‌వెల్ తవ్వుకుంటే అడ్డుకుంటారా.. ఏ విఆర్ఓ వస్తాడో, ఆర్ఐ వస్తాడో రాని వారితోనే ఎంపితో మాట్లాడించి లేఅవుట్‌లో బోరుబావి తవ్వుకుంటానని పాత్రికేయులు, అధికారులను హెచ్చరించినట్లు సమాచారం.

ఘనంగా మొహర్రం వేడుకలు

ప్రజాశక్తి-పరిగి

మండలంలోని కొడిగెనహళ్లి పంచాయతీ పరిధిలోని పెద్దిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా అందరూ జల్ది కార్యక్రమంలో పాల్గొని అగ్నిగుండం చుట్టూ ప్రదర్శన చేశారు. భక్తులు పీర్లకు చక్కెర చదివించారు. అనంతరం బాబాయ్యలను గ్రామాల్లో ఊరేగించి జలధికి తరలివెళ్లారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, వేడుకల నిర్వాహకులు కొండారెడ్డి, నరసారెడ్డి, నారాయణరెడ్డి, జూలారెడ్డి, వార్డ్ మెంబర్ అక్కులప్ప, శివప్ప, అశోక్, సిద్ధారెడ్డి, రాజా, మురళి, వినోద్, హరికుమార్, మంజునాథ్, తలారి సిద్ధప్ప, మల్లికార్జునప్ప, తదితరులు పాల్గొన్నారు.

జలధికి తరలిన పీర్లు

నంబులపూలకుంట : మొహర్రం వేడుకల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం పీర్లు ఊరేగింపుగా జలధికి తరలివెళ్లాయి. మొహర్రం సందర్భంగా మండలంలోని వంకమద్ది, ముండ్లవారిపల్లి, ఎదురుడోన, వెలిచెలిమల, నంబులపూలకుంట గ్రామాల్లో పీర్లను కొలువుదీర్చి మూడు రోజులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పీర్లకు చక్కెర, బెల్లం చదివించి మొక్కు తీర్చుకున్నారు. సాయంత్రం భక్తుల ఆనందోత్సాహాలు, మేళతాళాలు, డప్పు వాయిద్యాల మధ్య పీర్లను ఊరేగింపుగా జలధికి తరలించారు. ఊరేడింపులో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ వలిబాషా పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మౌలా సాబ్, నరసింహులు, రంగారెడ్డి, రాఘవయ్య, చంద్రశేఖర్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పరిగిలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

ప్రజలకు సుపరిపాలన కరపత్రాలు అందిస్తున్న మంత్రి

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

రాష్ట్రంలోని ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి సుపరిపాలన సాగిస్తుందని మంత్రి సవిత తెలిపారు. టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆమె స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి పట్టణంలోని వజ్రాలపేట ప్రాంతంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సుపరిపాలనకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. చిన్న చిన్న సమస్యలకు వెంటనే పరిష్కారం చూపారు. మంత్రి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో కుదేలైందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తోందన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ కన్వీనర్ శ్రీరాములు యాదవ్, త్రివేంద్రనాయుడు, బాబుల్‌రెడ్డి, కృష్ణమూర్తి, షౌకత్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ అర్జీలు స్వీకరిస్తారన్నారు. అర్జీల ద్వారా తెలిపిన సమస్యలు పరిష్కారం కాకపోతే మీకోసం కాల్ సెంటర్ 1100కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చన్నారు. జిల్లా కేంద్రంతో పాటు ఆయా డివిజన్, మండల కార్యాలయాల్లో కూడా అర్జీలు సమర్పించుకోవచ్చు అన్నారు.

బేస్‌బాల్ జిల్లా స్థాయి పోటీలు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

పట్టణంలోని ఎస్‌టిఎస్‌ఎన్ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో 7వ సీనియర్ బేస్ బాల్ జిల్లా స్థాయి పోటీలు ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర బేస్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈ పోటీలకు ఎపిలోని 26 జిల్లాల నుంచి బేస్ బాల్ క్రీడాకారులు హాజరయ్యారు. క్రీడాకారులకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మూడు రోజుల పాటు భోజన వసతి ఏర్పాటు చేశారు. కదిరిలో జిల్లాస్థాయి బేస్‌బాల్ పోటీల ఏర్పాటుకు సహకరించిన వారందరికీ అసోసియేషన్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పరిటాల వంశీ, సత్యసాయి జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ సభ్యులు నరసింహనాయక్, అనంతపురం జిల్లా కోచ్ నవీన్ పాల్గొన్నారు.

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యం

మంత్రి సత్యకుమార్‌యాదవ్
'సమస్యలు ఆలకిస్తూ.. పరిష్కరిస్తూ' కూటమి పాదయాత్ర

పాదయాత్రలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్, పరిటాల శ్రీరామ్, చిలకం, తదితరులు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మంత్రి సత్యకుమార్ యాదవ్, శాసన మండలి డిప్యూటీ ఛైర్‌పర్సన్ జకియాఖానమ్, ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, జనసేనపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి 18వ వార్డులోని రాఘవేంద్రస్వామి కళ్యాణ మండపం నుంచి 19వ వార్డు ఇందిరానగర్, 20వ వార్డు పిఆర్‌టి వీధి వరకూ పాదయాత్ర చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సుపరిపాలన కరపత్రాలను పంపిణీ చేశారు. ఇందిరా నగర్‌లో ఓ లాండ్రీ దుకాణం వద్ద మంత్రి ఇస్త్రీ చేసి ఆశ్చర్యపరిచారు. ఇళ్లు, డ్రెయినేజీ, సీసీ రోడ్లు, నివాసాల మధ్య జంగిల్ క్లియరెన్స్, నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు, తల్లికి వందనం తదితర అంశాలపై ప్రజల నుంచి వినతులు అందాయి. స్పందించిన మంత్రి త్వరలో జాబ్ మేళా నిర్వహిస్తామ న్నారు. టిడ్కో గృహ లబ్ధిదారులకు ఇళ్లు ఇప్పించేందుకు, అర్హులందరికీ తల్లికి వందనం అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గాంధీనగర్‌లో రైల్వేలైన్ పక్కనున్న ఇళ్లకు ప్రహరీ అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. శ్రీసత్యసాయి వాటర్ సప్లై కార్మికులు సమస్యలు విన్నవించగా వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

పట్టణంలోని యానిమల్ బర్త్ కంట్రోల్(ఎబిసి)సెంటర్‌ను సందర్శించారు. మౌలిక వసతులు, వైద్య సిబ్బంది, స్టెరిలైజేషన్ విధానాలపై సమీక్ష నిర్వహించారు. పట్టణంలో సుమారు 3 వేల వీధి కుక్కలు ఉన్నట్లు తెలియడంతో వీధి కుక్కల జనాభా నియంత్రణను అత్యవసరంగా క్రమబద్ధంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ ప్రక్రియలను వేగవంతం చేయ డంతో పాటు, భారత జంతు సంక్షేమ బోర్డు మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా, భద్రంగా ఉంచడంలో భాగంగా ఎబిసి సెంటర్ల పాత్రను మరింత బలోపేతం చేస్తామన్నారు. వారి వెంట మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, డీఈ ప్రకాష్, టిడిపి పట్టణ అధ్యక్షులు సుధాకర్, బిజెపి పట్టణ అధ్యక్షులు జింకా చంద్ర, రూరల్ అధ్యక్షులు చంద్ర, సీడ్స్ డైరెక్టర్ కమతం కాటమయ్య, శ్యామ్‌సన్, భాస్కర్, పోతుకుంట రాజు, విద్యుత్ శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-తలుపుల

స్థానిక సెవెన్ హిల్స్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం వైసిపి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కదిరి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త బిఎస్.మక్బూల్‌అహ్మద్, హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు రమేష్‌కుమార్‌రెడ్డి, ఉప సర్పంచి డికె.బాబు, మండల అధ్యక్షులు డిపి.ఫయాజ్ అహ్మద్ 2024 ఎన్నికల మేనిఫెస్టోలో చంద్రబాబు ఇచ్చిన హామీలు, ప్రజలను వంచిస్తున్న తీరును వివరిస్తూ వైసిపి రూపొందించిన 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ స్కాన్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ చంద్రబాబు ప్రజలకు హామీలు ఇచ్చి మోసం చేస్తున్న తీరును ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం ఇవ్వలేదన్నారు. బిసిలకు 50 ఏళ్లకే పింఛను ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదని, ఉద్యోగాలు కల్పించలేదని, నిరుద్యోగ భృతి చెల్లించకుండా యువతను దగ చేశారన్నారు. 18-59 ఏళ్ల వయసు మహిళలకు నెలకు రూ. 1500 ఇస్తామన్న హామీ ఊసే ఎత్తడం లేదన్నారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లచెరువు : వైసిపి మండల అధ్యక్షులు మొండెం రవికుమార్‌రెడ్డి అధ్యక్షతన ఆ పార్టీ నాయకులు 'రీకాలింగ్-చంద్రబాబు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు బిఎస్.మక్బూల్ అహ్మద్, హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు రమేష్‌రెడ్డి 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్ స్కాన్‌ను ఆవిష్కరించారు. చంద్రబాబు ప్రజలను మోసం చేస్తున్న తీరును ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లింగాల లోకేశ్వరరెడ్డి, రాష్ట్ర యాక్టివిటీ కార్యదర్శి వజ్రభాస్కర్‌రెడ్డి, మండల ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తలుపులలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ స్కాన్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

దాతల సహకారంతో సేవా కార్యక్రమాలను విస్తరిస్తాం

ఈడిగ విద్యార్థుల ప్రతిభా పురస్కారాల్లో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్, ఛైర్మన్ గురుమూర్తి

ప్రజాశక్తి-హిందూపురం

దాతల సహకారంతో సేవా కార్యక్రమాలను విస్తరిస్తామని మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్, గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ గురుమూర్తి పేర్కొన్నారు. ఆర్య ఈడిగ గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలలో శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా అత్యుత్తమ ప్రతిభ కనబరచిన 133 మంది విద్యార్థులకు ఆదివారం ఈడిగ ప్యాలెస్ ఫంక్షన్ హాల్ లో ప్రతిభ పురస్కారాలను అందించారు. శేఖర్ గౌడ్ అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో కెఇ. ప్రభాకర్, గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ గురుమూర్తి విద్యార్థులకు పురస్కారాలను అందించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు శేఖర్ గౌడ్, సెక్రటరీ వినయ్ కుమార్ మాట్లాడుతూ 133 మంది విద్యార్థులకు రూ. 11 లక్షలు నగదు పురస్కారాలు అందజేశామని,ఈ కార్యక్రమానికి తన వంతు సహాయంగా ఎమ్మెల్యే పీఏ శ్రీనివాస రావు రూ.1 లక్ష రూపాయలు అందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణప్ప,ఆదిమూర్తి, దేమకేతేపల్లి వెంకటనారాయణప్ప, పుల్లా రెడ్డి, చిన్నప్పయ్య, రిటైర్డ్ డీఈఓ మునయ్య, దేవేంద్రప్ప, కౌన్సిలర్ మల్లికార్జున గౌడ్, హరినాథ్ గౌడ్, రవీంద్రనాథ్, లక్ష్మీపతి సర్పంచులు తిరుమలేష్, ఆనంద్‌తో పాటు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట సింగిల్‌విండో అధ్యక్షుడిగా పాల్యం రామాంజులురెడ్డి

ప్రజాశక్తి-గాండ్లపెంట

స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సింగిల్‌విండో) అధ్యక్షుడిగా టిడిపి నాయకుడు పాల్యం రామాంజులురెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు ఆదివారం రామాంజులురెడ్డి తెలిపారు. అలాగే సొసైటీ డైరెక్టర్లుగా జయమున్నా, ఎం.వేమనారాయణలను నియమించారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ తాను పార్టీకి చేసిన సేవలను గుర్తించి అధ్యక్షునిగా ఎంపిక చేశారన్నారు. ఈ పదవితో నా బాధ్యత మరింత పెరిగిందన్నారు. మండలంలోని రైతుల సంక్షేమం, అభివృద్ధి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తన ఎంపికకు సహకరించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మండల కన్వీనర్ సి.కొండయ్య, సర్పంచి ఎస్.శివప్పనాయుడు, నాయకులు ఎ.వెంకటరమణారెడ్డి, జి.చంద్రలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో అంగన్వాడీ కార్యకర్త మృతి

ప్రజాశక్తి-బత్తలపల్లి

బత్తలపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ప్రధాన కార్యదర్శి, సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి వాసంతి ఆకస్మికంగా మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. వాసంతి(47) శనివారం రాత్రి తీవ్ర అనారోగ్యానికి గురవడంతో అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించగా అక్కడ బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. మండలంలోని ఎర్రాయపల్లి అంగన్వాడీ కార్యకర్తగా పని చేస్తున్న వాసంతి బత్తలపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిఐటియు ప్రధాన కార్యదర్శిగా సేవలందించేవారు. వాసంతి మృతి పట్ల పలు అంగన్వాడీ కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. వాసంతికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వాసంతి అంత్యక్రియలు సోమవారం ఉదయం స్వగ్రామంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, వివిధ సిఐటియు నాయకులు ఆ గ్రామం వెళ్లి వాసంతి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, మిగిలిన ప్రయోజనాలను త్వరితగతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వాసంతి (ఫైల్‌ఫొటో)

సమస్యల పరిష్కారానికే 'సుపరిపాలనలో తొలిఅడుగు'

ప్రజాశక్తి-గుడిబండ

ప్రజల సమస్యలు స్వయంగా తెలుసుకుని పరిష్కరించేందుకే ప్రభుత్వం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం చేపట్టిందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి తెలిపారు. మండలంలోని జమ్మలబండ గ్రామంలో ఆదివారం ఆయనతో పాటు టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి సుపరిపాలనకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఏడాది కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలను విన్నవించగా వాటిని ఎమ్మెల్యే ఎంఎస్.రాజుతో పాటు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సంక్షేమ పథకాలు అందని వారు వివరాలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, నాయకులు జయరామప్ప, నాగేంద్ర, డీలర్ శివన్న, గోపాల్, రాజు, సుబ్బు, మంజునాథ్, రమేష్, తిమ్మారెడ్డి, ఉమేష్, వెంకటరమణ పాల్గొన్నారు.

ఏడాది పాలనపై కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-రొద్దం

కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ఆదివారం టిడిపి మండల నాయకులు రొద్దంలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనపై కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే మండలంలో ఎన్నడూ చేయని అభివృద్ధి జరిగిందన్నారు. పెన్నా నదిలో, కళ్లకుంట, నల్లూరు మధ్యలో కల్వర్టు, రొద్దం నుంచి కందుకూర్లపల్లి గ్రామానికి సీసీ రోడ్డు, నల్లూరు నుంచి దందేపల్లి వరకూ తారు రోడ్డు, ఇంకా పలు గ్రామాల్లో సీసీ రోడ్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు మాధవనాయుడు, నరహరి, అశ్వర్థనారాయణ, వీరాంజి, పవన్, చంద్రశేఖర్, సిద్దన్న, రామకృష్ణ, హనుమంతరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆవులు చోరీ

కొత్తచెరువు : మండలంలోని మైలేపల్లి సమీపంలో ఉన్న ఓ వ్యవసాయ తోటలో ఆదివారం తెల్లవారుజామున రూ. 1.2 లక్షల విలువ చేసే రెండు ఆవులు చోరీకి గురయ్యాయి. కొత్తచెరువుకు చెందిన రైతు పల్లె కృష్ణప్ప మైలేపల్లి సమీపంలోని తన వ్యవసాయ తోటలో ఓ షెడ్డు ఏర్పాటు చేసి రెండు పాడి ఆవులను పెంచి వాటి ద్వారా కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి 9:30 గంటల వరకూ అక్కడే ఉండి ఆ తర్వాత షెడ్డుకు తాళం వేసి ఇంటికి వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం తోటకు వెళ్లి చూడగా షెడ్డులో ఆవులు కనిపించకపోవడంతో చోరీకి గురయ్యాయని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆవుల చోరీపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ మారుతి శంకర్ తెలిపారు.

హత్యకేసులో డీఎస్పీ విచారణ

కదిరి అర్బన్ : మండలంలోని బండ వాండ్లపల్లి గ్రామంలో ఈ నెల 11వ తేదీ నవీన్‌కుమార్ హత్యకు గురైన ప్రదేశాన్ని ఆదివారం డీఎస్పీ శివనారాయణస్వామి పరిశీలించారు. గ్రామ పెద్దలను కలిసి సమాచారం సేకరించారు. అలాగే గ్రామంలో శాంతిభద్రతల విషయాలపై గ్రామస్తులతో చర్చించారు. నవీన్ హత్యపై ఆరా తీశారు. గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డీఎస్పీ కోరారు. ఆయన వెంట అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సిఐ నిరంజన్ రెడ్డి, వారి సిబ్బంది ఉన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

పుట్టపర్తి రూరల్ : పట్టణంలోని మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ పర్యవేక్షణలో ఆదివారం శక్తి టీం బృందాలు, పోలీస్ సిబ్బంది కలిసి మహిళలకు శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అలాగే 112, 1930, సైబర్ నేరాలు, పోక్సో చట్టాలు, బాల్య వివాహాలు, ఈవ్ టీజింగ్, వన్ స్టాప్ సెంటర్ ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. మహిళలు సెల్‌ఫోన్లలో శక్తి యాప్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని, వారికి శక్తి యాప్ ప్రాధాన్యతను తెలిపారు. కార్యక్రమంలో శక్తి టీం బందాలు పాల్గొన్నారు.

వేడుకగా అక్కదేవతల జాతర

పుట్టపర్తి రూరల్ : మండలంలోని సుబ్బరాయనపల్లి సమీపంలో అటవీ ప్రాంతంలో వెలసిన చౌటకుంట అక్కమ్మ దేవతల పరస మహోత్సవం ఆదివారం కనుల పండవగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి అక్కదేవతల చుట్టూ ఎడ్ల బండిలో ప్రదర్శనలు నిర్వహించారు. భక్తులు అక్కమ్మగార్లకు ముడుపులు చెల్లించారు. పల్లె మాట్లాడుతూ ఏకాదశి పర్వదినం తర్వాత పదో రోజు నిర్వహించే జాతరలో అక్కదేవతలకు ప్రత్యేక పూజలు చేస్తారని తెలిపారు. ఈ జాతరలో ఎడ్ల బండ్ల పోటీలు ప్రత్యేక ఆకర్షణంగా నిలుస్తాయన్నారు. కర్నాటక నుంచి కూడా భారీగా భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరామ్‌నాయక్, బొమ్మయ్య, పెడబల్లి సహకార సంఘం ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ పాల్గొన్నారు.

జాతరకు ఎడ్లబండిపై వెళ్తున్న పల్లె